నరపతి

ఓ నరపతీ! నువ్వు ముప్పైయిద్దరు రాజకుమారులు మోసే వివిధరత్న సువర్ణపల్యంకికపై ఊరేగుతూ ఉంటావు.

గౌరీశంకరశృంగమహోన్నతహిమ ప్రదేశాలలో తిరుగాడే జీవమృగచామరాలతో నవయౌవనచంద్రికాస్నాతలైన మహారాజకుమారికలు పదహారుగురు మంజులకంకణకింకిణీ స్వనాలు వెలయ నీకు సదా వీస్తూఉంటారు. నీ వైభవం యక్షపతి కుబేరుడికూడా లేనేలేదు.

నరపతీ! నీ క్రీగంటిచూపులు చూడగానే హిమాలయాది పర్వతములు కదలిపోతాయి. సదా సంతోషంతో పొంగే ఒంటివాడైన సముద్రుడు ఇంకిపోతాడు. అనేకోర్మికోజ్జ్వలితమైన నీ అంగుళీవ్యంజనములకు ఒక్కసారిగా ఇరువదియొక్క అక్షౌహిణీలు గజతురగపదాతులు, సర్వనౌకాబలాలు హుమ్మని ముందు కురికిపోతవి. మానవావృత నిబిడ జనపదములు ఎడారులైతే, మరుభూములు పట్టణాలౌతవి. నీ బలసంపత్తి దేవచమూపతియగు కుమారునకే లేదు.

2

ఆ నరపతి ఒకనాడు ముప్పైరెండురాజ్యాలకు పాలకులగు తన సామంతులకుమారులు మోసే అందలమునుంచి దిగాడు. మంచి అందమైన వస్త్రాలు ధరించి, అంతఃపురంలో అంతటా ఏమాత్రం దారికైనా ఎడంలేకుండా, అడ్డంగా పండుకొనిఉన్నారు, తాను జయించిన జాతిరాజ్యాలనుంచి ఖైదీలుగా

పట్టుకొనివచ్చిన మంత్రులు, సేనానాయకులు, రాజకుమారులున్నా—వాళ్ళమీదనుంచి రాళ్లుపొదిగిన బంగారపుచెప్పులతో నడుస్తూ తనమందిరం చేరాడా రాజు. ఆ మందిరవైభవం మచిలీపట్టణపు పల్యాంకపురీప్రతిసీరాదులు, గంధాతిముక్తకశ్రీపర్ణికాది దారువుల శిల్పములుగల గోపానసీపటలాదులు, దంత స్తంభాలు, రత్నఖచిత సువర్ణసింహాసనాలు, సింహశార్దూల మృగాదన కృష్ణసారాది మృగచర్మాలు, సువర్ణధూపదీప స్తంభాలు, కాశ్మీరపు పట్టుపనిచేసిన దుకూలాంబరాల చాందినీలు, అందుండి వ్రేలాడు నీలగారుత్మతలోహితక, వజ్రముల దీపపు బుడ్లు, భీమ, వాయుపుత్రాభిమన్యు, రామ, రావణ, సుందోపసుందాదివీరుల చిత్రలేఖనములు, స్ఫటికరత్న నీలాది వివిధవర్ణ శిలలు, చంద్రశిలలు చెక్కిన శిల్పాలు.

ఆ నరపతి వచ్చి పట్టుతలగడలు, పరుపులు వేసిన ఒక పీఠముపై అధివసించగా, పూర్ణచంద్రబింబాస్యలగు బాలికలు వచ్చి, కొందరు సువాసనవేళ్ళ విసనకఱ్ఱలతో వీస్తున్నారు. కొందరు వీణాగీతాలతో కంఠాలు మేళవించి, కాకలీధ్వనులతో పాటలు పాడుతూఉన్నారు. కొందరు పాదసేవ చేస్తూఉన్నారు. కొందరు వర్ణకంతో వయ్యారంగా అతని దేహమునకు లేపూత పూయుచున్నారు.

ఆ నరపతి మహాసత్త్వుడు, ఆజానుబాహుడూ అయి ఉన్నాడు. అతని విశాలమైనవక్షం హిమాలయపర్వతసానువులా ఉంది. అతనిభుజాలు, చేతులు ఏనుగుకుంభాలు, తొండాలు. ఆ నరపతి గౌరీశంకరశృంగంలా మహోన్నతరూపుడు.

మల్లయుద్ధ గదాయుద్ధాలలో శక్తి, తోమరం అవీ అత్యంత నిపుణంగా వేయటంలో యిరువదినాలుగు రీతుల కత్తిసాములు, ఘాతము, గతి, వక్రిమ, ప్రతిఘాత, అవగతి, లక్ష్యము మొదలైనవాటిల్లో అత్యంతంగా ప్రావీణ్యం ఉంది. ధనుర్వేదంలో అర్జునుణ్ణి మించిపోతాడు. గజ తురగ శాస్త్రము లతనికి అశ్వనీ కుమారులకుమల్లే అతివిచిత్రంగా వచ్చును.

ఆ నరపతి చాలా అందమైనవాడు. అతన్ని చూస్తే అప్సరసలు మొదలైన దివ్యనారీమణులకూ కూడా హృదయం కొట్టుకోనేది. దేవతల్లో నే లేడు ఆతనితో సమానమైన సుందర మూర్తి. అతడు అన్నికళల్లో, అన్నిశాస్త్రాలల్లో మహాసిద్ధి సంపాదించాడు

సేనలు నడపడం, కొద్దిసేనలతో గొప్పసైన్యములను కూడా చీకాకుపరచి నాశనంచేయడం, ఘనవ్యూహాలు పన్నడం, వీటిల్లో ద్రోణాచార్యుడుకూడా అతనికి ఈడుకాడు.

భయంకరంగా యుద్ధముజరిగినప్పుడుకూడా అతని సైన్యాల్లో భటులు ఎప్పుడూ కొద్దే నశించడం. రథ గజ తురగ పదాతిదళాలప్రతివీరుడు, సముద్రాల్లో ఆ నరపతియుద్ధ నౌకలనావికులు అందరూ అతడంటే మహాప్రేమతో ఉంటారు. ఆతడు వారికి నచ్చిన నాయకుడు. గొప్పగా ధన మిచ్చుప్రభువు, వారి హృదయం రంజించే వీరుడు.

దేశాలన్నీజయించాడా నరపతి. కానుకలూ, కప్పాలు కొన్నాడు. రాజసూయయాగములు మూడు చేశాడా చిన్న తనంలోనే—అర్థము కాకపోయినా,

ఉండే నిరసనచేత, వాళ్ళకష్టసుఖాలు విచారించడంగాని, వాండ్లకు సౌకర్యాలుకలుగజేయడంగాని, వాళ్ళకు సరియైన న్యాయంకలిగేట్లుచూడడంగాని, సుతరామూ ఏమిన్నీలేదు. తన కింద ఉండే సామంతరాజులు ఎవరైనా తన మండలంలో ప్రజానురంజకులై వారిని సకల ధర్మయుక్తంగా పరిపాలన చేస్తూఉంటే, ఆ రాజులను ఈ నరపతి హేళనచెయ్యడం వాళ్ళను తన మహాసభలో అగౌరవపరచడం.

నరుల్ని వాహనంగా జేసి నైరుతినిమించిన రాక్షసుడై నరబాధకుడై మహా అందగాడై ఆ నరపతి మహాభయంకర భుజంగంలా, చండ మృగాదనంలా, క్రూరసౌందర్యంతో విరాజిల్లుతూ ఉండేవాడు.

4

ఆనాడు అలా మందిరంలో శయనించిఉండి, మూలగా వీణవాయిస్తూఉన్న ఒక దివ్యమోహనవిగ్రహమైన చిన్నదాన్ని తనదగ్గరకురమ్మని సైగజేశాడు ఆ నరపతి. ఆమెను వర్ణించాలంటే మనోహర సుగంధకుసుమాలన్నీ మలగికలగిపోతవి. మందమలయ శీతలపవనాంకురాలు మాటుమణిగిపోతవి. మంజలసౌదామినిలతలు మసకమసకలై పోతవి.

ఇరువదివర్షాలుప్రాయంవాడైన ఆ నరపతి వివాహము చేసుకోనలేదు. వివాహం అతని కేమీ ఇష్టంలేదు. స్త్రీఅంటే అసహ్యము. జీవ ప్రపంచంలో హేయమైంది వనిత. వాళ్ళు సేవకేకాని, ఉద్వాహంచేసుకోవడానికా? ఆ నరపతి ఘోటక బ్రహ్మచారి.

వణుకుతూ వచ్చింది ఆ కన్యక నరపతి యెదుటకు. “భరత వర్షంలో ఉన్న అద్భుత లావణ్యవతీ గణములలోకెల్ల నువ్వు చాలా అందమైనదానవట గదా? నీ కన్నులు ఆనందంలో సర్వోజ్జ్వల నీలాభ్రపథముల తేలియాడి సర్వవర్ణాల మినుకాడు నక్షత్రాల్ని, విచారంలో జలప్రతిబింబిత కాదంబినీచ్ఛన్న సంధ్యాకాంతుల్ని, రౌద్రంలో భయంకర కాలాహిఫణాగ్రజ్వలిత రత్నాల్ని, ప్రేమలో శరత్పూర్ణిమాచంద్రచంద్రికాంచల స్వచ్ఛ నర్తనాల్ని పోలుతవటగా? అయితే ఏం! నాకు నిన్ను చూస్తే ఈ అసహ్యం ఎందుకు?” అని నరపతి అడిగాడు.

ఆ బాల మాటాడలేదు. “నీవీ మృదువైన దేహంతో, నీ కులికిపోయే వయ్యారంతో నిల్చున్నావు. హారాలతో వెలిగిపోతున్న నీ కంఠాన్ని ఈ వేళ్ళు నలిపివేస్తే ఏం చేస్తావు?” ఆ అబల ఒక అడుగు వెనక్కి వేసింది.

“ఉస్” అని నరపతి ఆ పీఠము పట్టుదిండ్లపై ఒరిగిపోయాడు. ఆతని కర్కశహృదయంలో ఏదో తీరని వ్యథ!

పసిపిల్లలా నరపతికి హేయపదార్థములు. అతడు రాజ్యాలలో సంచరిస్తూ ఉంటే నిసుగులు కంటబడకూడదు. ఏ తలిదండ్రులైనా, నరపతి కెదురుగా పోనిచ్చారా ఆ తలిదండ్రులకు నూటయిరువది కొరడా దెబ్బలు; ఆ శిశువుకు ఒక చిన్న బెత్తపు కొరడా దెబ్బ!

ఆ నరపతి రాజ్యంలో ప్రజలకి అతడంటే భయం. పరాయి రాజ్యాల్లో ప్రజలకూ ప్రాణభయమే. ఏ మిడతలదండులా, ఏ మహామారిలా సైన్యాల్తో వచ్చిపడతాడో అని భయం ఎంతదూరంలో ఉండే రాజ్యాలవారికూడా.

5

అతడు సర్వశాస్త్రాలు మూలబెట్టాడు. సంగీతాది మనోహరకళలు మటుమాయాచేడు సభలు, రాజ్యాంగమంత్రాలోచనలు మరిచేపోయాడు. మంత్రులంటే అసహ్యము. రాజ పశువులు మోసే అందలం ఎక్కడం, సైన్యశిబిరంలోకి పోవడం, వాళ్ళతో మాయాయుద్ధక్రీడలు సలుపుతూ ఉండడం–అదే అతనికి నిత్యక్రీడ.

మళ్ళీ దిండ్లమీదనుంచి లేచాడు. "ఓ బాలికా! నేను చేసిన మహాయుద్ధాలలోకెల్ల ఉత్కృష్టమైన రణరంగంలో, నాశక్తి ఎవరనూ ఆరీతిగా కదల్పలేకపోయినటువంటి ద్వంద్వ యుద్ధంలో, నీరాజ్యసైన్యాలు, నీతండ్రి సహాయనృపతుల సైన్యాలు—ముప్పదినాల్గక్షౌహిణీల్ని, నీతండ్రినీ ఓడించి నిన్ను చెరపట్టుకువచ్చా.

ఏమిటి నిన్ను తీసుకువచ్చినలాభం? అచ్చరలకన్న అందకత్తెలనిచెప్పే రాజకన్యకలంటే నాకు జుగుప్సమాత్రమే. నువ్వంటే కోపంకూడాను—కాని మాటలకే భయపడి వెనకంజవేశావే, నువ్వు నా వేటకుక్కలముందర వేయుటకుకూడ పనికిరావు."

ఆ బాలికకళ్ళు మిరుమిట్లుగొలిపాయి. ఆమె శ్వేతఫాలము, పాటల కపోలము, అరుణములైన పెదవులు కంపించినై. "ఓ నరపతీ! నీకడ నన్నటువంటి కౌలేయకరాజ్యాల్లో ఎట్టి భయంకర శునకాన్నైనా తీసికొని రానిమ్ము, నన్నది ఏమిచేస్తుందో నీ కన్నులు పారకి స్తవిగాక!"

తోకతొక్కిన భుజంగంలా లేచాడా నరపతి. సాయంకాలానికి సభ్యులు, తన ధనకనకమహాపట్టణంలోని ప్రజలు, సామంతులు, సైన్యాధిపతులు, అందరూ మల్లరంగానికి రావాలని ఆజ్ఞ పంపించాడు.

ఏమిది రాజాజ్ఞ? అని అందరూ చేరారు. అత్యంతవిశాలమైన మల్లరంగం కిటకిటలాడిపోయింది— జనసమూహాలతో. మల్లరంగంలో యిసుక రేణువులు ఆ అపరాహ్ణసూర్యకిరణాల్లో తళుకుతళుకుమనిపోయాయి.

నరపతి తేరిపారచూడజాలని వైభవంతో వచ్చాడు. ఆయుధపాణులైన స్త్రీభటులు పారాయిచ్చే అందలంలో వచ్చింది ఆ బాలిక. ఆ అబలారత్నాన్ని రణరంగంలోనికి తీసుకొనివచ్చారు. నరపతి సింహాసనం ఆక్రమించాడు. ఆ బాలిక చేతిలో ఒక బెత్తముమాత్రమే యున్నది.

నరపతికన్నుల్లో అపహాస్యపు వెలుగులు తిరుగుతూ ఉన్నవి. నరపతి చేతితో సంజ్ఞచేయగానే ఒకవైపునుంచి రాక్షసుడొకడు (ఒక అడివిజాతి మనుష్యుడు) భయంకరరూపంవాడు, జేవురించిన ఎఱ్ఱనిరంగువాడు, మిట్టకోరలవాడు, చింపిజుట్టువాడు, మదించినదేహంగలవాడు, ఎనిమిది అడుగుల పొడవుగలవాడు, రాతిదిమ్మెల వెడదఎదవాడు, మిడిగుడ్లవాడు గట్టి బంగారపుగొలుసుతో ఒక శునకాన్ని పట్టుకొని రణరంగంలోకి దుమికాడు.

6

మంచుకొండలకివుత్తరంగా సోమేరు, మహామేరు, సుమేరు అను పర్వతాలున్నవి. మహామేరువే పశ్చిమద్వీపాల పర్వతపంక్తులకు, భరతఖండ, ఉత్తరదేశ, యక్ష దేశములమహీధరశ్రేణులకు మాతృస్థానము. అక్కడ గాలి చొరజాలని అడవులున్నై. ఆ అడవుల్లోంచి ఒక రాక్షసుడు పెద్దపులికన్న భయంకరమైంది, సివంగికన్న వేగంకలది, ఏనుగులాంటి సత్వం కలది, ఒక మృగదంశకమును తీసికొనివచ్చి, ఆ నరపతి గాంధారదేశంలో దండుతో విడిసివున్నప్పుడు అతనిఎదుటకు వచ్చి నిల్చాడు.

"ఓ మొకిమీడా! నువ్వు నన్ను మల్ల ముష్టియుద్ధాల్లో గెలిస్తే నేనూ, సింహాన్నిచంపే నా కుక్కా నీకు బానిసలమౌతాము. నేను గెలిస్తే నువ్వోడిపోతావా? నీ రాజ్యాల్లో, నా యిష్టమైనట్లు ఒక నెలదినములు వుండి, నా అడవులకుపోతా" అని రాక్షసుడన్నాడు.

ఆ మానవుణ్ణి ఎగాదిగా చూశాడా నరపతి. వీరులతో యుద్ధంచేయడమే నరపతి జీవితము. సేనానాయకు లెవరికి యిష్టం లేకపోయినా, వాళ్లు నరపతికి ఆలోచనచెప్పలేరు. నిమిషంలో వాళ్ళప్రాణం లేదన్నమాటే. శార్దూలచర్మపు టొరుకంతో ముందు కురికాడా నరపతి. భుజాస్ఫాలనంచేస్తూ మదపుటేనుగుల్లా, ఉన్నతపర్వతాలవలె రెండుసముద్రాల్లా వాళ్ళిద్దరూ ఒక యామం పోట్లాడారు. రాక్షసునిబలం, అనంతబలపూర్ణుడైన నరపతి జవం, యుద్ధనైపుణ్యము అతి విచిత్రము.

రాక్షసుడు ఆయాసపడిపోతూ ఉన్నాడు. నరపతి బలమంతా కూడబెట్టుతూ ఉన్నాడు. ఒక్కసారిగా మెరుపులా, రాక్షసుడు ఒళ్లు తెలియని అడవిదున్నపోతులా, రెండుగుప్పిళ్లు పైకెత్తి తన విరోధిశిరము వ్రయ్యలుచేయడానికి ఉరికాడు. నరపతి అంతకన్న అతివేగంగా, కండలుకట్టినఎడమచేయి, తల పైకెత్తి ఆ రెండుదెబ్బలు అందుకొని, కుడిచెయ్యిగుప్పిటతో పిడుగు లాంటి ఒక సమ్మెటపెట్టు ఆ రాక్షసునిముఖంపై ప్రయోగించాడు. రక్తం కక్కుకుంటూ ఆ రాక్షసుడు పడిపోయాడు.

... ...

ఆ రాక్షసుడు కుక్కతో రణరంగంలోకి ఉరికి, ఆ బాలికను ఎగాదిగా చూసి, ఆ బంగారుగొలుసు విప్పాడు నవ్వే పెదవులు ఆమెఅందాన్ని ఇనుమడిస్తూవుండగా, ఛంగున తనమీదికి కోరలు తెరచి వురికిన ఆ భైరవాసికంటె అమితవేగంతో ఆ బాలిక, పైకి తప్పుకొని తనచేతిబెత్తముతో ఆ కుక్కముట్టెమీద అగ్నిశిఖలాంటి ఒక దెబ్బ చురుక్కు మనిపించింది. ఆ జాగిలం బాధచే ఉరుములాంటి అరపు అరిచింది. కోపంతో వెనక్కుతిరిగి, ఆ బాలికపైకి ఉరక్కుండానే పరుగునవచ్చింది. ఆ బాలికమోముపై నవ్వులేదు. మహాశక్తి తాండవమాడుతోంది ఆమెచేతిబెత్తం మేఘాల్లో మెరుపైంది. ఆ సారమేయసింహము మొగముచుట్టూ ఆ బెత్తం జవజవలాడించింది. ఆ కుక్క ఏమీతోచక ఒక ముహూర్తము చైతన్యరహిత మయింది.

ఇంతటిలోకే చురుక్కుమని సన్నని బెత్తపుదెబ్బ సరిగా కుక్క కళ్ళపై తగిలికళ్లుమూతపడిపోయినవి. కెవ్వుమని ఆ సారమే

భుపతి నేలపై మూతిమోపి, హృదయంకరిగే అరపు అరచి నాను. ఉరుమువంటి దానిగొంతుక కరిగిపోయింది.

ఆ శునకరాజము భయపడిపోయింది. ఏమియు తోచక తాత్కాలికంగా గుడ్డిఅయిపోయినకళ్ళతో నిల్చింది. దానిడొక్కలు, దేహము వణికిపోయాయి. ఆ బాలిక ఆ బెత్తము పారవేసి, అత్యంత మాధురీస్వనాల్తో ఆ కుక్కదగ్గరకు పోయి, దానితల తన వొడిలో ఉంచుకొని, దానిచెవిలో మాటలు చెప్పసాగింది. దాని ఒడలు తుడిచింది. దానికళ్ళు ఒత్తింది. నీళ్లు కారుతూవున్నకళ్ళు విప్పిందా కుక్క. బాలిక మొగం చూచి బొంగురుధ్వనితో ఆమెమోము నాఘ్రాణం చేసింది. తన్ను ఓడించిన ఆ బాలిక్కీ, ఆ కుక్కకూ ప్రాణస్నేహం కుదిరిపోయింది. ఆ బాలిక చురుకువాటులతో ఆ శునకరాజము యొక్క కరకుతనం మటుమాయమైపోయింది. నీళ్ళు నుడితిరుగు కమలనయనాలతో ఆ బాలిక ఆ కుక్కను ముద్దుపెట్టుకొని కౌగలించుకొంది.

ఆమె జవ్వన నిలబడి ఆ నరపతిదిక్కుచూచి "నరపతీ! నువ్వు మహాబలవంతుడవట; మహా ఖడ్గ కృపాణయుద్ధాల్లో ప్రఖ్యాతి నందినావట; నీకు నువ్వే సాటట; నువ్వు ఓడించినావని గర్వంపడుతూవున్న మా తండ్రిగారే నాకు గురువు. నేనూ సమస్తాయుధాలు అవలీలగా ఉపయోగించే కౌశలము నేర్చాన్ని. నీవు వీరుడవైతే నాతో కరవాలయుద్ధానికి రమ్ము. నువ్వు మహాబలవంతమనుకొనే ఈ సారమేయము నాకు ఓడిపోయినది. దీనికిన్నీ దీని స్నేహితుడగు నీ రాక్షసున

కున్నా పతివైన నిన్ను నేను ఓడించేయగలను.” అని కాంతుల మెరిసే చూపులు వెదజల్లుతూ ఆ బాలిక అన్నది.

ఆ నరపతికి కోపంవచ్చింది. ఆ బాలికను ఆపాద మస్తకం చూచాడు. సింహాసనాన్నుంచి రెండంగల్లో ఆ బాలికదగ్గరకు వచ్చాడు. అతనితోపాటు సామంతులు, మంత్రులు, సేనాధికారులు, ఉద్యోగులు, సభ్యులు, ప్రజా సమూహం అందరూ లేచారు.

ఆ నరపతి బాలికభుజం పట్టి, తీక్ష్ణంగా ఆమెమోము చూశాడు. ఒక్క పెడనవ్వు నవ్వాడు. తన అంగరక్షబలాధి కారికి తనకరవాలం తెమ్మని ఆజ్ఞయిచ్చాడు.

సింహాసనము ప్రక్క ఆయుధపీఠముమీద వుంచిన నిశిత — కరవాలము — రత్నాలుపొదిగిన బంగారుపిడిగలదాన్ని — కన్యాకుబ్జములో ప్రఖ్యాతివహించిన ఒక మహాసిద్ధుడు రచిం చినదాన్ని, ఓటమిఎరుగని ఆయుధరాజాన్ని తీసి, ఆ నీరెండలో ఝుళిపించినాడు.

ఆ బాలిక ఆ అంగరక్షకబలాధికారిని పిలిచి అతని చెవిలో ఏదో ఒక రహస్యం చెప్పింది. అతడు నరపతి అను మతితో రాజాంతఃపురముండుచోటికి పోయి, అక్కడ ఈ బాలిక చెలికత్తెయైన ఒక అంగనదగ్గిరవున్న ఒక పొడుగు పాటిపెట్టె కొనివచ్చి ఆ బాలికముందిడెను. ఆమె ఆ పెట్టె నొకమీట నొక్కి తెరచి, అందుండి పట్టుసంచిలో నున్న ఒరగలకరవాలము నొకదాన్ని తీసింది. ఆ వరనుండి సునాయాసముగా కరవాలము పైకి లాగి యుద్ధసన్నద్ధయై నిలిచింది. ఆ వంకరకత్తికి దంతపుపిడియే వున్నది. ఆ కత్తిపై

యిరవై నాలుగు అధర్వణవేదమంత్రాలున్నవి. ఆ కరవాలము పూర్వకాలాన చంద్రునిహస్తాన్ని వెలిగిపోయేదని ఋషులు చెప్పుకొంటారు.

ఆ నరపతి క్రూరనేత్రాలు ముడుచుకుని, నలకలై, తీక్ష్ణసూక్ష్మాగ్నులై పోయాయి. ఆబాలికమోము శక్తిపూర్వక మైన హాసచంద్రికలు వెదజల్లుతూనేవుంది. వారిద్దరు యుద్ధం ప్రారంభించారు. సూక్ష్మకౌశలము కొంత చూపించాడా నరపతి. ఆ బాలిక వాని నన్నింటినీ నడుమనే విరిచింది.

ముందున్న ఎడమకాలువంచి, కుడికాలు మనోవేగాన్ని ముందంజగా వేసి, అడుగునుండి ఎదుటి ఆయుధాన్ని తన ఆయుధంతో, మెరుములా పైకికొట్టి, ఆ మెలికే క్రిందివంపుగా త్రిప్పి, కత్తిపిడివట్టిన ముష్టియొక్క బొటనవేలిని పొడుచుటకు వరాలకమని పేరు. ఆ నరపతి ఆమెను అమితవేగాన నిరాయుధగా చేయుటకని ఆ నేర్పుచూపగానే, ఆమె నవ్వుచు అతని కన్న అద్భుతమైనవేగంతో, దానికి మారుఎత్తువేసి తప్పు కొను టేకాకుండా, శూలవారియనుపేరబరగు మెలికతో తన కరవాలము అతనినొసటకు సూటిపెట్టింది. మహా కౌశల్యం గలిగినవాడగుటచేత ఆ నరపతి అత్యాశ్చర్యంతో చంగున వెనక్కు దుమికినాడు.

అక్కడనుంచి ఖంగుఖంగుమని కత్తులమోతలతో, చరుస్తిమను రాపిళ్ళతో పన్నెండు ముహూర్తములకాలము వారిద్దరు ద్వంద్వసమరం చేసినవారైనారు. కొంతకాలము ఆ బాలిక మహాశక్తియైనది. పక్కపోటులు, అడ్డకోతలు, నిలువు తీతలు, మెలికలు, వంపులు, మలుపువేటులు, జడివానలోని

చినుకుల్లా ఆ నరపతిచుట్టూ వర్షింపజేసింది. వేటుకు అడ్డు పాటువంపుకు నిలువు తెంపు. మెలికకు జరిగిన వాలుక, తీకకు పదును వేత, వీనితో ఆ నరపతి ఒక్క అడుగే ఒక్క అడుగే వెనక్కు తగ్గుతో ఏమరుపాటుకాని చూపుతో కాపాడుకుంటూ ఆ రంగంచుట్టూ మూడుసార్లు తిరిగాడు. విచిత్రమైన నేర్పుతో నరపతి ఒక్కగంతున నూతనగతులు ప్రారంభించి, ఆ బాలికను సుడిగుండములోని పుష్పంలా ఆడించివేసినాడు. అంతకన్నను మఱియు మంచివిన్నాణంతో తన్ను రక్షించుకుంటూ బాలిక వేటుకు వేటు, పాటుకు పాటు, కోతకు కోత బదులిచ్చుచు వెనక్కి తగ్గినది.

ఆ పోరాటము ఇంకను పది ముహూర్తములు సాగినది.

7

ఏ వేగానవచ్చిందో, ఏ మెరుపుతో వచ్చిందో ఒక అతి సున్నితమైన వజ్రఘాతమువంటి పోడుపు! ఆ బాలికకు హృదయముకడ గాయము; చేతిలో కత్తి పట్టువీడి నవ్వుతో కళ్ళుమూతపడ, "ప్రభూ! నువ్వు విజయం గాంచినావు సుమీ!" అని అంటూ దిగజారి రణరంగములో పడిపోయింది. ఆమెగుండెలనుండి చివ్వున రక్తపువెల్లువ వెడలివచ్చినది.

ఆ నరపతి నెత్తివాళ్ళా చూశాడు అటూ ఇటూ. పడిపోయిన ఆ మహారాజకుమారిత—ఆ వీరకన్యకవైపు దృష్టి పోనిచ్చాడు. అతని కేమిటో మతిపోయినట్లయింది ఒక్కసారిగా. తన్నెదిరించిన ఈ తుచ్ఛబాలిక కూలిపోయిందికదా! అని సంతోషాన నిటూర్పువచ్చాడు.

చెలువుల మెరుపై, కారుమబ్బులలోంచి వెలిగిపోయే చంద్రకిరణాలదండై, సడలిపోయిన పూలదండలా ఉన్న ఆ బాలిక మోము చూశాడు! తనకత్తి విసరి పారవైచి, చటుక్కున వంగి, ఆ బాలికను ఎత్తుకొని తన హృదయానికి అదుముకొన్నాడు. ఆ నరపతికళ్లు నీటిసుళ్లు తిరిగినవి. "ఎంతటి రాబందె మనిషిని. ఈదేవి పాదాల ధూళి తాకుటకయిన అర్హుడను కానే! తుచ్ఛహృదయంతో, — నా ప్రాణానికి ప్రాణం, నా ఆత్మకు పరమేశ్వరియైన నా దేవిని కరకుపిశాచి వలె నరుకుకొన్నాను— దేవీ! ఒకసారి కనుతెరవవా! మూఢుడైన ఈ పాపిని క్షమించవా?" అని వడకిపోవు కంఠధ్వనితో విలపించాడు.

... ...

మేఘాలతోనిండిన రాత్రిలో ఉదయం ప్రవేశించిన ట్లు బాలిక కన్నులు విప్పినది. వర్షపుచినుకులతోనిండిన పూలపై ఉదయారుణకమలకాంతకిరణాలు ప్రసరించినట్లు, ఆమెపెదవుల నవ్వులు ప్రసరించాయి.

"ప్రభూ! ఇప్పటికైనా మీ హృదయం కరిగిందా? ప్రేమించిన నా ప్రియరుధిరాంసి, కర్కశశిలాచ్ఛాదితం అయి ఉన్నదని నాకు తెలుసును ఆత్మేశ్వరా!" ఆమె మాటలు ఇంకను అస్పష్టమైనాయి. "ప్రభూ మీ కఠినహస్తాలు నా పూల పా—ను— పు!"అని ఆమె కన్నులుమూసుకొని మూర్ఛ పోయింది.

అతనిచేతులలో దివ్యవరంలా, అమృతకలశిలా, రూపం దాల్చిన పరమమోక్షంలా ఉన్న ఆ బాలికనుదురు పెదవులతో స్పృశించి ఆ నరపతి కన్నులెత్తి "నేను లేరనుకున్న సర్వ దేవతలారా! నాకు మీచే ప్రసాదింపబడిన ఈ మహాయజ్ఞ ప్రసాదాన్ని మీరే తరలించుకుపోకుందురుగాక!

"ఓ విశ్వాలను నిండిఉన్న ఇంద్రమిత్రావరుణులారా! ఈ మీ దివ్యవరమైన అమృత రహస్యాన్ని ఈ మీ నూతన భక్తుడు అంచులుమాత్రమైనా సాన్నిధ్యంచేసుకోకుండా మీరు తరలించుకుపోకుందురుగాక!

"ఓ సర్వజగజ్జీవుల ప్రియబంధువైన శమనుడా! మృకండసుతుని నువ్వు చేకొనిపోలేనియట్లు నా యీ ఆత్మశక్తి రూపాన్ని తరలించుకుపోలేకుందువుగాక!"

ఆతని ఆర్తనాదము గజేంద్రుని గాఢదీనాత్మికమైన మంత్రమైనది.

ఆ బాలిక అతనిచేతులలో కదలినది. ఆతనిచే ఆ బాలిక సింహాసనంమీద పరుండపెట్టబడినదాయెను. ఓ నరపతి! నువ్వు లోకాలను హింసించినవాడవు. నేడు ఈమె సాన్నిధ్యంలో ప్రజాదాసుడవైపోయినావు.

ఓ నరపతీ! నువ్వు లోకదుఃఖాన్ని కర్కశత్వాన్ని నీ లోచనాలనుండి ఇంద్రప్రియుక్తమైనవజ్రము మేఘాలను కరిగించునట్లు, నీ తీక్ష్ణబాధచేత కరిగించి ప్రవాహాలు కట్టించినావు.

ఆ నరపతి మాతలా ఆమె స్తనవస్త్రము సడలించినవాడాయెను.

ఆ నరపతి దెబ్బతిన్న హరిణమాతను చూచిన శాబకంలా వణకిపోయినాడు.

వెంటనే అపరధన్వంతరివంటి మహాఋషి ఆ బాలికను సమీపించి గాయము పరిశీలించి, హృదయము తప్పి దిగువగా జారిపోయిన ఆ మహాగాయాన్ని ఓషధులచే కట్టుకట్టినాడు.

9

శీతతమస్సులు వీడి పరిమళపూరితమైన వసంతము వనవృక్షశాఖాంతరాల నునురెమ్మలుగా, కషాయకిసలయాలుగా ఉదయించింది.

ఉషస్సులలోని మత్తు సడలి నూత్నసృష్టి జలజలలాడుతూ పొంగివస్తున్నది.

ఆకాశాన తెల్లని రాయంచలజంట. చిగురు గుబురులలో పికద్వయం. సరస్సులో కమలంపై లేత సూర్యకిరణం.

ఆ నరపతి ఆ బాలికమానవత్వపీఠంముందు ఉదయపూజోపవిష్టుడై.